క్లుప్తంగా

13 నుంచి ఉరుసు మహోత్సవం

సిద్దవటం : మండల కేంద్రం పరిధిలోని ఎగువ పేటలో చారిత్రాత్మకమైన ఆస్తాన-ఏ- ఫత్తు మియ్యా దర్గాలో ఈనెల 13న ఆసార్-ఎ-షరీఫ్ ఉరుసు మహోత్సవాలు జరుపనున్నట్టు ముత్తవల్లి సయ్యద్ అబ్దుల్ అజీజ్ ఖాద్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 13న ఫతేహా ఖాని జరుగుతుందన్నారు. రాత్రి 9 గంటలకు మిలాదు నబీ ఉపన్యాసములు, నాత్ ఖ్వాని కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 14న ఉరుసు సందర్భంగా మహమ్మద్ ప్రవక్త వస్తువులను ప్రదర్శిస్తారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉరుసు మహోత్సవాన్ని జయప్రదం చేయాలని వారు తెలియజేశారు.

పశువులకు వైద్య పరీక్షలు

నందలూరు : మండలంలోని పొత్తపి గ్రామంలో వింత వ్యాధితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పశువులకు బుధవారం వైద్య సేవలు అందించినట్లు పశువైద్యాధికారిణి అశ్వినీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ నెలలో ఇక్కడి పశువులకు గొంతువాపు రావడంతో పరీక్షలు నిర్వహించి వ్యాక్సిన్ వేయడం జరిగిందన్నారు. గత రెండు రోజులలో రెండు పశువులు మృతి చెందినట్లు సమాచారం అందడంతో గ్రామానికి వచ్చి వైద్య శిబిరం నిర్వహించి, పశువుల రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు పంపామన్నారు.

ఘన నివాళి

రామాపురం : మండలంలోని బండపల్లి గ్రామం పొత్తుకూరివాండ్లపల్లెకు చెందిన సి.జయరామిరెడ్డి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి బుధవారం మృతుడి స్వగృహానికి చేరుకొని జయరామిరెడ్డి మృతికి గల కారణాలు తెలుసుకొని ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన వెంట కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15న ఉచిత వైద్య శిబిరం

రామాపురం : ఈనెల 15న వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి తిరుపతి వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ సభ్యులు లయన్ ఆంజనారెడ్డి, శ్రీనివాస్ యాదవ్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత వైద్య శిబిరాన్ని రామాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని వచ్చేవారు ఆధార్‌కార్డు తీసుకొని రావాలని, షుగర్, బీపీ వ్యాధులు ఉండేవారు సంబంధిత ధృవపత్రాలను తీసుకురావాలన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

స్వర్ణ పతక విజేతకు సత్కారం

వీరబల్లి : నేపాల్ జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు సాధించిన నాగరాజును మండల కేంద్రంలో సత్కరించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ అజంతుల్లా మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యనభ్యసించిన నాగరాజును అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించడం పాఠశాలకు గర్వకారణమన్నారు. విద్యార్థులు నాగరాజును స్ఫూర్తిగా తీసుకుని విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. అనంతరం నాగరాజును దుశ్శాలువాతో సత్కరించి రూ. 5 వేలు నగదు బహుమతిని అందజేశారు. కాగా నాగరాజు కళాశాలలో 2011లో విద్యనభ్యసించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ భాస్కర్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీఓ-85ను రద్దుచేయాలి



నిరసనలో వైద్యులు, వైద్య సిబ్బంది

గాలివీడు : జీఓ నెం-85కి వ్యతిరేకిస్తూ బుధవారం నూలివీడు, గాలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు నిరసన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్లు అసోసియేషన్ పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్లు స్రవంతి రెడ్డి, శంకర్ నాయక్, రాధ మాధవీ, రఫీ లు మాట్లాడుతూ జీఓ 85 వల్ల తమ మూడు ఏళ్ల సర్వీసు వ్యర్థమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అకస్మాత్తుగా జీఓని మార్చడం అన్యాయమని తెలిపారు. దీని వల్ల తమ వృత్తి ప్రగతికి తీవ్రంగా నష్టం కలుగుతుందని అన్నారు. జీఓ రద్దు చేయాలని గత రెండు నెలలుగా అధికారులకు, మంత్రులకు వినతిపత్రాలు అందించినప్పటికీ స్పందన లేదన్నారు. ఈ జీఓతో ప్రభుత్వ వైద్యశాలలో సేవలందించిన వైద్యులకు అన్యాయం జరుగుతుందన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

సుండుపల్లె : మండల కేంద్రంలోని పీహెచ్‌సీ పరిధిలోని సుండుపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం మాసోత్సవాన్ని డాక్టర్ ఆసన్ వలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పాలు, గుడ్లు, ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గర్భిణి ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగేంద్రమ్మ, ఎంపీహెచ్ఏ సుబ్బరాజు, ఏఎన్ఎం నీలిమ, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణనాథుని శోభాయాత్ర

- ఐదో రోజు పెద్దసంఖ్యలో విగ్రహ నిమజ్జనాలు
- బాణాసంచాలు, కేరింతల నడుమ ఊరేగింపు
- బందోబస్తు కల్పించిన పోలీసులు



చిన్నమండెం: శ్రీనివాసపురం రిజర్వాయర్‌లో గణనాథులను నిమజ్జనం చేస్తున్న యువకులు



సిద్దవటం: పెన్నానది సమీపంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసిన అధికారులు



సంబేపల్లె: దేవపట్లలో చాందినీ బండిలో గణేశుడిని నిమజ్జనానికి తరలిస్తున్న నిర్వాహకులు

రాజంపేట టౌన్ : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా బుధవారం గణనాథుడి నిమజ్జన వేడుక కోలాహలంగా సాగింది. నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కువ సంఖ్యలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు గణనాథుడిని నిమజ్జనం చేయడంతో ఎటుచూసినా సందడి వాతావరణం కనిపించింది. అనేక ప్రాంతాల్లో కోలాటం వేస్తూ, బ్యాండ్ వాయిద్యాలకు నృత్యాలు చేస్తూ గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.

సంబేపల్లె : మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలలో కొలువైన గణనాథులను బుధవారం జై జై గణేశా అంటూ నిమజ్జనానికి తీసుకెళ్లారు. ఉదయం నుంచి ఆయా గ్రామాలలోని ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గణనాథుల విగ్రహాలను పురవీధులలో బాణాసంచాలు కాలుస్తూ, డప్పు వాయిద్యాల నడుమ వైభవంగా వేడుకగా శోభాయాత్ర నిర్వహించారు. విగ్రహాలను చెరువులు, కుంటలు వాగులలో వదిలారు. ఎస్ఐ భక్తవత్సలం ఆధ్వర్యంలో బందోబస్తు కల్పించారు.

వీరబల్లి : మండల కేంద్రంలో కొత్తపేట వీధిలో వినాయక చవితి సందర్భంగా ఐదవరోజు బుధవారం వినాయకుని నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించి, మధ్యాహ్నం అన్నప్రసాదాలు పంపిణీ చేసి సాయంత్రం స్వామివారిని ఊరంతా ఊరేగించి నిమజ్జనానికి తీసుకువెళ్లారు.

లక్కిరెడ్డిపల్లి : భక్తుల కోలాహలం నడుమ మండలంలోని గణనాథులు బుధవారం నిమజ్జనానికి తరలివెళ్లాయి. మండలంలోని చాలా గ్రామాలలో కొలువైన వినాయక ప్రతిమలు ఐదోరోజు బుధవారం గ్రామస్తులు, వినాయక కమిటీ సభ్యులు గణనాథులను బాణాసంచా నడుమ నిమజ్జనానికి తరలించారు. అంతకుముందు దాతల సహకారంతో వినాయక ప్రతిమల వద్ద భక్తులకు, గ్రామస్తులకు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్ఐ రవీంద్రబాబు తన సిబ్బందితో కలిసి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

పెనగలూరు : మండలంలో వినాయక చవితి సందర్భంగా ఐదోరోజు నిమజ్జన కార్యక్రమాలు కొనసాగాయి. ఇండ్లూరు, కంబాలకుంట గ్రామాలతోపాటు తదితర గ్రామాలలో వినాయక స్వామి నిమజ్జనం నిర్వహించారు. మండలంలో ఇప్పటి వరకు 83 విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటం లోని ఆకులవీధి, భోయవీధి, భాకరాపేట, వడ్డివారిపల్లె, కొమ్మనాయునిపల్లె, నేకనాపురం ఎస్సీ కాలనీ, బొగ్గిడివారిపల్లె, 11వ బెటాలియన్ హెచ్‌పీసీఎల్, ఉప్పరపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన వినాయక స్వామి విగ్రహాలకు బుధవారం వైభవంగా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలానే పెన్నానది సమీపంలో నిమజ్జన ప్రదేశం వద్ద మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రంగలక్ష్మి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

నందలూరు : నాగిరెడ్డిపల్లి పంచాయతీ ఆర్ఎస్ రోడ్డులోని వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన రంగవల్లుల పోటీలు జరిగాయి. ఈ పోటీలలో గోదా లక్ష్మీదేవి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకొని వెట్ గ్రైండర్‌ను, ఎంబలూరు కళ్యాణి ద్వితీయ స్థానంలో నిలిచి మిక్సీ, కలిశెట్టి వెంకటసుబ్బమ్మ తృతీయ స్థానంలో నిలిచి ఎలక్ట్రికల్ స్టవ్, గోదా భవిత నాల్గో స్థానంలో నిలిచి ప్రెజర్ కుక్కర్, మేడా పార్వతి ఐదో స్థానంలో నిలిచి ఐరన్ బాక్సును కైవసం చేసుకున్నారు.

చిన్నమండెం : మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఉన్న గణనాథులను ఆయా ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం గంగ ఒడికి చేర్చారు. ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో శ్రీనివాసపురం రిజర్వాయర్ వద్ద జరిగిన నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు. విగ్రహాల ఊరేగింపులో యువత నృత్యం చేస్తూ వినాయక విగ్రహాలను శ్రీనివాసపురం రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు.

రామాపురం : వాడవాడలా కొలువైన గణనాథుని విగ్రహాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం మండలంలోని బండపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుడి ప్రతిమ వద్ద నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పాల్గొని ప్రారంభించారు.



నందలూరు: ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు



రాజంపేట టౌన్: శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న మహిళలు



లక్కిరెడ్డిపల్లె: నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ సాధ్యం

రాయచోటి అర్బన్ : సరైన అవగాహనను కలిగివుండి, తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారానే ఎయిడ్స్ నియంత్రణ సాధ్యమవుతుందని జిల్లా అదనపు వైద్యారోగ్యశాఖ అధికారిణి డాక్టర్ శైలజ అన్నారు. రాయచోటి డైట్ కళాశాలలో బుధవారం జిల్లాస్థాయి రెడ్‌రిబ్బన్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యుక్త వయస్సుకు వచ్చిన విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాప్తి మీద అవగాహనను కల్పించడం ద్వారా ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపించవచ్చన్నారు. క్విజ్‌పోటీలు, మారథాన్ వంటి కార్యక్రమాల ద్వారా మహమ్మారిపై అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల నుంచి 36 బృందాలు ఈ క్విజ్‌పోటీలలో పాల్గొన్నట్లు చెప్పారు. క్విజ్‌పోటీల్లో మొదటిస్థానంలో నిలిచిన సంబేపల్లె జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు రుక్సానా, రుక్సార్‌లకు రూ. 5వేల నగదు బహుమతితో పాటు ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు వారు నగదు బహుమతులను అందజేశారు. అలానే వీరు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపల్ జ్యోతిర్మయి, జిల్లా సైన్స్ అధికారి ఓబుళరెడ్డి, ఆప్ కాస్ట్ జిల్లా కోఆర్డినేటర్ రవీంద్రారెడ్డి, జిల్లా రీసోర్స్‌పర్సన్ అల్లావలీ, ప్రాజెక్టు సిబ్బంది స్వాతి, సాదిక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్విజ్‌పోటీ విజేతలకు బహుమతిని అందచేస్తున్న ఏడీఎంహెచ్ఓ, డైట్ ప్రిన్సిపల్‌లు

సేంద్రియ వ్యవసాయంతోనే లాభాలు

రాయచోటి టౌన్ : రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ సూచించారు. బుధవారం రాయచోటి రూరల్ పరిధిలోని గొర్లమొదివీడు బాలిరెడ్డిగారిపల్లెలో ఇండ్-గ్యాప్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంలో ఎలాంటి పద్ధతులు పాటించాలనే విషయాలను వివరించారు. అలానే రాష్ట్ర సీడ్స్ వెరిఫికేషన్ ఏజెన్సీ వారు ఆర్గానిక్ ప్రొడక్టు సర్టిఫికెట్ ఇస్తారన్నారు. దీంతో పంటలను అధికధరలకు అమ్ముకొవచ్చని తెలిపారు. అలానే గ్రామంలో బీడు భూముల్లో సాగవుతున్న వేరుశనగ పంటను పరిశీలించారు. ఐదారేళ్లుగా పంటలు పెట్టని భూములను పరిశీలించారు. ఇలాంటి భూములను సాగుకు అనుకూలంగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓలు దివాకర్, సి రమేష్ రాజు, ఆర్ఎస్‌కె అధికారి జి.కిరణ్ కుమార్ రాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వంశీ,యశోద పాల్గొన్నారు.



పొలంబడి కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



పుల్లంపేట: ఉమామహేశ్వర్‌రావును సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం



సంబేపల్లె: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు రెడ్డెయ్యరాజు దంపతులకు సన్మానం

పుల్లంపేట : ఆర్.ఉప్పరపల్లిలో ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఉమామహేశ్వర్ రావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. బుధవారం అంతంపల్లి స్కూల్ కాంప్లెక్స్‌లో ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నాగా తిరుమలరావు మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు మంచి విద్య అందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ చక్రాధర్ రాజు, అనంతంపల్లి కాంప్లెక్స్ చైర్మన్ జయలక్ష్మి, రమణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లె : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న రెడ్డయ్యరాజును బుధవారం ఘనంగా సన్మానించారు. అన్నమయ్య జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు రమాదేవి, శ్రీనివాసులు అవార్డు గ్రహీతకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో సన్మానించారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలో 2023–24 సంవత్సరంలో జరిగిన పనులపై సోషల్ ఆడిటింగ్‌ను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో తనిఖీలు బుధవారం నిర్వహించి సమీక్షించారు. ఉపాధి హామీ డ్వామా ఏపీడీలు రవికుమార్, ప్రతాప్, డీవీఓ ప్రకాశ్‌లు సామాజిక తనిఖీలో పాల్గొన్నారు. మండలంలో రూ. 13.14కోట్ల విలువైన పనులు జరిగాయన్నారు. వీటన్నింటిపై తనిఖీలు నిర్వహించి తప్పులు జరిగినచోట చర్యలు తీసుకుంటామన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడం కుట్ర

నియోజకవర్గంలో ఫీల్డ్ అసిస్టెంట్లు 15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారని, వీరిని ఎటువంటి తప్పుడు లేకుండా తొలగిస్తే ఉద్యమం చేస్తామని సీపీఐ నేతలు పందుగోల మణి, రాజశేఖర్‌లు హెచ్చరించారు. అలాగే అడిషనల్ పీడీ రవికుమార్‌కు వినతిపత్రం అందించారు. ఎన్డీఏ కూటమి, తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించాలని ప్రయత్నిస్తూ ఉందన్నారు. చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్న వారిని తొలగించాలనుకోవడం సిగ్గు చేటన్నారు. వీరిని తొలగించే ప్రక్రియ కొనసాగిస్తే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

శాంతియుతంగా నిమజ్జనం జరుపుకోండి

పెనగలూరు : వినాయక స్వామి నిమజ్జనాన్ని శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి పి.కొత్తపల్లి వినాయక స్వామి మండపం వద్ద గ్రామస్తులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. వినాయక స్వామి ఆలయాన్ని నూతనంగా నిర్మించడంతో ఇక్కడ తొమ్మిదిరోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనం చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో ఎస్ఐ గ్రామ యువతను పిలిచి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. గొడవలు జరిగితే ఉత్సవ కమిటీ సభ్యులదే బాధ్యతని తెలియజేశారు.

నేటి నుంచి సబ్ కలెక్టరేట్‌లో ఇసుక బుకింగ్

రాజంపేట : రాజంపేట సబ్ కలెక్టరేట్‌లో ఇసుక బుకింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. కూచువారిపల్లి సచివాలయంలో ఉన్న ఇసుక బుకింగ్ సెంటర్‌ను కలెక్టరేట్‌లోకి మార్చారు. గురువారం నుంచి ఇసుక బుకింగ్ సెంటర్ సేవలు సబ్ కలెక్టరేట్‌లో ప్రజలకు అందజేయనున్నారు. సేవలను సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ కోరారు. కాగా పట్టణానికి దూరంగా ఉన్న కూచువారిపల్లిలో ఉన్న ఇసుక బుకింగ్ సెంటర్‌ను సబ్ కలెక్టరేట్‌లోకి మార్చడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వీరబల్లి : పదోతరగతి, ఇంటర్మీడియట్ చదవకుండా మధ్యలో ఆపివేసిన విద్యార్థులకు తిరిగి చదివే అవకాశం ఓపెన్ స్కూల్ ద్వారా పొందవచ్చని ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ రామచంద్ర తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ. 200లు రుసుముతో ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రామాల సమస్యలు పరిష్కరిస్తాం

చిట్వేలి : మండలంలోని అన్ని గ్రామాలలో సమస్యలను పరిష్కరిస్తామని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ హామీ ఇచ్చారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం జరిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో తాగునీరు, సీసీ రోడ్లు వంటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మండలంలోని విద్యుత్, తాగునీరు, ఉపాధిహామీ సమస్యలపై ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తెచ్చారు. ఆయాశాఖలలో జరుగుతున్న అభివృద్ధి గురించి అధికారులు సభ్యులకు వివరించారు. సమావేశంలో ఎంపీపీ చంద్ర, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, లారీ సుబ్బరాయుడు, ఎల్‌వీ మోహన్‌రెడ్డి, రామాంజులనాయుడు, ఎంపీటీసీ సభ్యులు నాగార్జున, సర్పంచ్ గుత్తి నరసింహ, కో-ఆప్షన్ సభ్యులు అన్సర్ బాషా, ఎంపీడీఓ శివరామిరెడ్డి, ఏఈ వెంకటాచలపతి తదితరులు పాల్గొన్నారు.

చేసింది గోరంత.. ప్రచారం కొండంత

- వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం వైఫల్యం
- ప్రజల దృష్టిని మరల్చేందుకు వైఎస్సార్‌సీపీ నేతల అరెస్టులు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి



రాయచోటి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బురద రాజకీయం చేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. విజయవాడ పరిసర ప్రాంతాల ప్రజలు వరద నీటిలో విలవిలలాడుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు వారిని ఆదుకునే ప్రయత్నాలు గోరంత చేస్తూ కొండంత ప్రచారం చేసుకుంటున్నారన్నారు. వరదలు వచ్చి వారం రోజులు కావస్తున్నా తిండి, తాగునీరు లభించక వరద బాధితులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకు ఈడుస్తున్నారన్నారు. వరద నీరు ఉప్పొంగుతుందని ప్రభుత్వానికి ముందే సమాచారం ఉన్నా ప్రజలను అప్రమత్తం చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. బుడమేరు, ఆపై ఉన్న చెరువుల నుండి ఉధృతంగా వచ్చే వరదనీరు నుంచి ముఖ్యమంత్రి నివాసాన్ని, వారి అనుయాయుల గృహాలు, పవర్ ప్లాంట్‌లు దెబ్బతినకుండా కాపాడుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం సఫలమైందన్నారు. కానీ వరద బాధితులను నేటికీ తగిన రీతిలో ప్రజలకు సౌకర్యాలు అందకపోవడంతో ప్రజల నుంచి నిరసనలు, విమర్శలు వస్తాయన్న భయంతోనే వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను, విజయవాడ నగర డిప్యూటీ మేయర్ భర్తను పోలీసులచేత అరెస్టు చేయించి ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చంద్రబాబు ప్రభుత్వం చేస్తోందన్నారు. అసలు రాష్ట్రంలో పాలనను బాబు ప్రభుత్వం గాలికి వదిలేసిందని, ఎన్నికలలో ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయకపోగా వాటి గురించి అడిగిన వారిపై తప్పుడు కేసులను కూటమి ప్రభుత్వం బనాయిస్తుందన్నారు.

కరువు రైతులను ఆదుకోవాలి

రాష్ట్రంలో వరదల కారణంగా విజయవాడ, గుంటూరు, కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళం ప్రాంతాలలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వర్షాలు లేక రాయలసీమ ప్రాంతాలలో పంటలు సాగుకు నోచుకోక బాధలు పడుతున్నారన్నారు. రాయలసీమలోని అనేక గ్రామాలలో తాగునీరు లభించక అష్టకష్టాలు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి కరువుతో ఉపాధి లేక వలసలే శరణ్యమంటున్న ప్రజలను ఆదుకోవాలన్నారు.

ర్యాగింగ్ భూతాన్ని అంతమొందించాలి


రైల్వేకోడూరు అర్బన్ : విద్యార్థులు అందరూ కళాశాలలో సోదరభావంతో మెలిగి ర్యాగింగ్ భూతాన్ని అంతమొందించాలని బుధవారం సీఐ హేమసుందర్‌రావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ర్యాగింగ్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఏటా కళాశాలలోకి ఉన్నత చదువుల కోసం ఎందరో విద్యార్థులు వస్తూ, పోతుంటారని, జూనియర్‌ల పట్ల సీనియర్లు సోదరభావంతో మెలగాలని తెలిపారు. విద్యార్థులు ర్యాగింగ్, మాదకద్రవ్యాలు వంటి జోలికిపోతే తామంతట తామే ఉన్నత భవిష్యత్తును నాశనం చేసుకున్నవారవుతారని పేర్కొన్నారు. ఉన్నత లక్ష్యాలతో చదువులు చదివి తమ జీవితానికి కాలేజీలు చుక్కానిలా మారాలని తెలిపారు. కాలేజీలలో చదివేటప్పుడు చదువులు పక్కదోవ పట్టకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్‌లు ఎం.భాస్కర్‌రెడ్డి, డాక్టర్ శ్రీలతలు, జి.రమేష్, దయానంద, శ్రీనివాసులు, ప్రేమలత, సుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత మిథున్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలి

రాజంపేట టౌన్ : ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. స్థానిక ఆకేపాటి భవన్‌లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఎంపీ మిథున్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆకేపాటి కేక్‌ను కట్ చేసి వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిన్న వయస్సులోనే ఎంపీ కావడమే కాక వరుసుగా మూడుమార్లు ఎంపీగా ఎన్నికైన ఘనత మిథున్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించే మిథున్‌రెడ్డికి భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాకతీయ విద్యాసంస్థల అధినేత పోలా వెంకటరమణారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి, నాయకులు డీలర్ సుబ్బరామిరెడ్డి, వడ్డే రమణ, గడికోట సుబ్బారెడ్డి, సౌమిత్రి, బొల్లినేని రామ్మోహన్‌నాయుడు, గీతాల నరసింహారెడ్డి, గౌస్, దండు గోపి, జాహిద్ అలీ, జీవీ సుబ్బరాజు, మలిశెట్టి శ్రీనివాసులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో వస్త్రదానం

ఓబులవారిపల్లె : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బుధవారం పాపిరెడ్డి పల్లి జీవనజ్యోతి ఆనందనిలయం ఆశ్రమంలో వృద్ధులకు వస్త్రదానం, అన్నదాన కార్యక్రమాలను మాజీ డీఆర్‌యూసీసీ మెంబర్ తల్లెం భరత్‌కుమార్ రెడ్డి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ యూనియన్ నాయకులు అక్కిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్‌లు జరుగు నారాయణరెడ్డి, పోలి పాపిరెడ్డి, ఎంపీటీసీ పైడి గిరి నాయుడు, ఆశ్రమ నిర్వాహకులు పొన్యం సుబ్రమణ్యం, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడు, సుబ్రమణ్యం రెడ్డి, గల్లా శ్రీనివాసులు, పొన్యం జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఓబులవారిపల్లె: వస్త్రదానం చేస్తున్న నాయకులు


రాయచోటిలో..

రాయచోటి(జగదాంబ సెంటర్) : పట్టణంలోని వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో బుధవారం రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ జిల్లానేత మహమ్మద్‌ఖాన్‌ల ఆధ్వర్యంలో పార్టీనేతలు, కార్యకర్తలు కేక్‌కట్ చేసి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నేతలు విజయభాస్కర్, షబ్బీర్ అహమ్మద్, రియాజ్ అహమ్మద్, అబుజర్, నవాజ్, ఫయాజ్ అహమ్మద్, ఖలీల్‌బేగ్, ఖాదర్‌వలీ, సుగవాసి శ్యామ్‌కుమార్, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి : మండల కేంద్రంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి నివాసంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అలానే స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు.



రాజంపేట టౌన్: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి



వీరబల్లి: కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఘనంగా ఎంపీ మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలు

నందలూరు : ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు నాగిరెడ్డిపల్లి గ్రామంలో డీఎంసీ రోడ్డులో మిథున్‌రెడ్డి యువసేన ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. తమ అభిమాన నేత రాబోయే రోజుల్లో మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని, ప్రజల మన్ననలు పొందాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మిథున్ రెడ్డి యువసేన నాయకులు రామకృష్ణ, ప్రదీప్ కుమార్, మున్నా, చింటూ, సురేష్, కిరణ్, సౌమ్యనాథ్, అంజన్, అఖిల్, సాయి తేజ, తదితరులు పాల్గొన్నారు.